

# 'మధ్యతరగతి జీవితం'

-యం.వి.లత

టక టక టక టక టకటక - బ్ర్ - టక టకటక టకటక ...

పోస్ట్! — టైప్ చేయడం ఆపి లెటరందుకున్నాడు వెంకటేశ్వర్లు. దస్తూరి తండ్రిదే. చింపి చదవసాగాడు.

"చిరంజీవి పెదబాబుకి- మీ నాన్న దీవించి వ్రాయుట. ఇచ్చట అంతా క్షేమం. నీవు, అమ్మాయి పద్మా క్షేమమని తలుస్తున్నాము. మీ అమ్మకి షుగరు ఎక్కువైంది. నాకు బి.పి. ఎక్కువైంది. (మరి అంతా క్షేమం అని రాస్తాడేమి?) తమ్ముడు బాబ్జీకి ఇంకా ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. వెధు స్నేహాలు ఎక్కువైనాయి. చెల్లి ధనలక్ష్మికి సంబంధం వచ్చింది. కట్నం లక్ష, బంగారం పది తులాలు గాక లాంఛనాలట! (పేరు మాత్రమే ధనలక్ష్మి. పాపం) ఎంత తక్కువలో చూసుకున్నా ఇంతకు తక్కువగా ఎవ్వరూ రావడం లేదు. అధవా వచ్చినా అమ్మాయి ఉద్యోగం చేయాలట. మీ అమ్మ దాని పెళ్లి కోసం బెంగపెట్టుకుంది. నువ్వు బంగారం సర్దగలిగితే చాలా సంతోషం. (ఎక్కడిది? పద్మదా?) ఇల్లు అమ్మేసి, అప్పో సప్పో చేసి దాని పెళ్లి చేసేస్తా. నువ్వే నాకు అండ. ఈ దిగులుతో నేను గుటుక్కుమంటే పూర్తి భారం నీమీదే పడుతుందని నా భయం, బాధ! వెంటనే ఉత్తరం వ్రాయి. చిట్టి తల్లి దీప్తికి మా ముద్దులు దీవెనలు.

ఇట్లు

ఆశీస్సులతో మీ నాన్న - పరంధామయ్య

'నిట్టూర్పు' అసంకల్పిత ప్రతీకార చర్యలా వెలువడింది. భార్యవైపు చూశాడు. జిరాక్స్ తీస్తోంది ఏకాగ్రతగా. పట్టుమని పాతికేళ్ళు లేవు వెంకటేశ్వర్లుకి. కట్నం వస్తుందన్న ఆశతో సరైన వుద్యోగం లేకున్నా పెళ్ళి చేసేశాడు తండ్రి. పైగా మామగారు అండగా వుంటారనే ఆశ ఆడపిల్లల తండ్రి ఆయనేం అండ? పెళ్ళయిన రెండేళ్లకి ఆడపిల్ల పుట్టింది. టీ.వీ.లో ప్రతి రోజూ పెరిగిపోతున్న జనాభా సంఖ్య చూస్తూ గుండెలు బాదుకోవడం కంటే దేశానికి తన వంతుగా బర్త్ కంట్రోలు ఆపరేషన్ చేయించుకున్నాడు. మంది ఎక్కువైతే మజ్జిగ పల్చనన్నట్టు- పిల్లలెక్కువైతే ఖర్చులు గాక ఏమి ఆస్తి ఇవ్వగలడు. ఆడపిల్లైనా, మగపిల్లవాడైనా ఎవరైనా ఒక్కటే చాలు అనుకున్నారా దంపతులు. అతడిని మెచ్చుకోవాలి. తెలివైన మాట భార్య చెప్పినా అహంకారాలు పోక వింటాడు. ఇద్దరూ కల్సి భావి జీవిత ప్రణాళిక వేసుకున్నారు. ప్రయివేటు ఫర్మ్‌లోని జీతం బొటాబొటీగా సరిపోతుంది. ఊరికే ఎవ్వరూ వుద్యోగం ఇవ్వరు. పాతిక వేలు కనీసం లంచం ఇవ్వాలి. దాని బదులు బ్యాంకులోను తీసుకుని ఇంటి ముందు గదిలో ఓ జిరాక్స్ మిషను, రెండు టైపుమిషన్లు పెడితే బాగుంటుంది అనుకున్నారు. ఆచరించారు. ఇప్పుడు కొద్ది మొత్తం పెట్టుబడి పెట్టి 'డోర్ టు డోర్' పద్ధతిలో సరుకులు అందిస్తున్నారు ఓ కుర్రాడిని పెట్టుకుని. పిండిమర పెట్టాలని మరో ఆలోచన. క్షణం విరామం, విశ్రాంతి లేకుండా గడియారంలోని ముళ్ళలా ఆ భార్యాభర్తలు రోజులో పద్దెనిమిది గంటలు కష్టపడుతున్నారు. రెండు వేలు డొనేషను కట్టి కూతుర్ని ఇంగ్లీష్ కాన్వెంట్‌లో చేర్పించారు.

ఇప్పుడు తండ్రి దగ్గర్నుండి ఈ వుత్తరం. మళ్లా ఉత్తరం తెరిచి చివరి పంక్తులు చదివాడు. "ఈ దిగులుతో నేను గుటుక్కుమంటే పూర్తి పూర్తి భారం నీ మీదే..."

హూ! ఇదో రకం బెదిరింపు. ఏమిటో అంతా కృత్రిమత్వం. రక్త సంబంధాల ఆప్యాయతలు మరుగున పడిపోయి వ్యాపార బంధాలే మిగులుతున్నాయి.

ఎవరో వచ్చారు. పద్మ వారికి జిరాక్స్ పేపర్స్ ఇచ్చేసి డబ్బులు తీసుకుంది. పద్మ తన భాగ్యదేవత. తన శాంతి, సౌఖ్యం, సంతోషం అన్నీ పర్యవేక్షిస్తూ తల్లిలా, సహచరిగా, స్నేహ బాంధవిగా తన జీవితానికే ఇంద్రచాపంలా తనకు దక్కిన వరప్రసాదిని.

వెనుకపాటుగా వచ్చి చెవి మీద ముద్దు పెట్టుకుని ఈ లోకంలోకి తెచ్చిందామె భర్తని. ఆలోచనల నుండి తేప్పరిల్లి తండ్రి వుత్తరం ఆమె చేతిలో పెట్టాడు. చదివి అతడికిచ్చేస్తూ "మీ నిర్ణయం మీద నాకు నమ్మకం వుంది. బాగా ఆలోచించి జవాబు రాయండి" అంది. 'సరే' అన్నట్టు తల వూపాడతడు.

పూజ్యులైన నాన్నగారికి—

మీ వుత్తరం అందింది. సంగతులన్నీ గ్రహించాను. జీవితావసరాలే సమస్యలుగా మారిన రోజులు. ప్రతీ సమస్యనీ తెలివిగా పరిష్కరించుకోవాలి. అమ్మ షుగరు తగ్గాలంటే పిండి పదార్థాలు బాగా తగ్గించి, పచ్చి కూరగాయలు తినమను. ముఖ్యంగా మీ ఇద్దరూ మానసికంగా వ్యధ చెందకూడదు. మీరు మీ చుట్టలు మానరు. ఉప్పు, కారం బాగా తగ్గించండి. ప్రశాంతత అలవరచుకోండి. గుండె నిబ్బరం కలిగి వుండాలి. చెల్లి పెళ్లి కాలేదని అమ్మ బెంగ పెట్టుకుంటే ఎలా? నేను బాగా ఆలోచించి తోచిన విషయాలు రాస్తున్నాను. మీరూ ఆలోచించండి.

నేను బి.కాం. చదువుకున్నాను. ఉద్యోగంలో

(రాజమండ్రి జేసీరెట్స్‌వారి పోటీలో రూ.100/-ల మూడవ బహుమతి పొందిన కథ)

స్థిరపడి, నాలుగు రాళ్లు వెనకేసుకుని, నైట్ కాలేజీలో యం.కాం. చదవాలనుకున్నాను. కేవలం కట్నానికి ఆశపడి పాతిక వేలకి నన్ను అమ్మేసుకున్నారు. అంతేగా! పద్మ నన్ను కొనుక్కుంది. ఇప్పుడు నా ఆర్జన అంతా నా కుటుంబానికే చెందాలి న్యాయంగా. అయినా పద్మ మంచిది కనుక, మానవత్వపు విలువలు తెలుసు కనుక మీ పట్ల గౌరవాభిమానాలతో, మీ సమస్యలన్నీ తన బాధ్యతగా ఎంచుకుని కొడుకు కోసం చూడక వాస్తవిక పరిస్థితులకి రాజీపడి శ్రమ మార్గం ఎన్నుకుంది. స్త్రీ అయ్యుండీ తను చేస్తున్న పనులు తమ్ముడు చేయలేడా? దేశ, కాల పరిస్థితులు అవగాహన చేసుకుని ఎవరో వస్తారు; ఏదో చేస్తారని ఎదురుచూడక స్వయంగా ఉపాధి మార్గం చూసుకోవాలి. ఎంత చిన్నదైనా సరే- ఆత్మ విశ్వాసానికీ, ఆత్మ గౌరవానికీ, బ్రతకడానికీ అది చాలు. గాలికి కొట్టుకుపోయే చిత్తు కాగితంలా గాక, మనకంటూ స్థిరమైనా లక్ష్యం, జీవితాశయం వుండాలి. చదువులు ఐపోగానే మన ఆశలు, ఆశయాలు ఎంచుకోవాలి. వాటికై మార్గాలు అన్వేషించాలి. మనసుంటే తప్పక మార్గం వుంటుంది. నా చిన్న వుద్యోగం గాక భార్య సహాయంతో టైప్, జిరాక్స్, 'డోర్ టు డోర్' బిజినెస్. కోళ్ళ పెంపకం, పిండిమర, ఫాన్సీ షాప్ ఇవన్నీ ఆలోచనలో వున్నాయి. ఒక్కసారిగా పెద్దఎత్తున మనలాటివారు వ్యాపారులు చేయలేరు. కనుక, నాన్నా తమ్ముడిని నా దగ్గరికి పంపించేయండి. నేను వాడి సమస్య తీర్చగలననే అనుకుంటున్నాను. ఇక చెల్లి పెళ్లి గురించి. నాకు బిజినెస్‌లోనే హెల్ప్ చేస్తున్న ఓ ఫ్రెండ్ వున్నాడు. తల్లి ఒక్కతే అతనికి ఆత్మబంధువు- బాధ్యత. మంచివాడు రవి. అతనికి మెడికల్ షాపు వుంది. మీరు ఇల్లు అమ్మేసి ఇక్కడికి వచ్చేయండి. అందరం కల్సి వుందాము. బయట పనులు ఎక్కువై పద్మ సతమతమవుతోంది. అమ్మ వస్తే ఇంట్లో అండగా వుంటుంది. పచ్చళ్ళు, అప్పడాలు పెడుతుంటే అవి కూడా అమ్మవచ్చు. మీకు ఏదో వ్యాపకం దొరుకుతుంది. ఇల్లు అమ్మిన డబ్బు చెల్లి, రవి పేరున బ్యాంకిలో వేసి రిజిష్టర్ మ్యారేజి చేద్దాం. మీరు అనారోగ్యంతో దూరంగా వుంటే మాకూ దిగులే కదా- కనీసం దీప్తి కోసం అయినా మీరు వచ్చేయండి. నేను రాసింది నచ్చినా నచ్చకున్నా నేను చేయగలిగిందేమీ లేదు. పద్మ బంగారం మీద నాకు హక్కు లేదు. తన తర్వాత దీప్తి కివ్వాలి కదా! ఆడంబరాలకి పోక వున్నంతలో జీవిస్తే సమస్యలే వుండవు. ఉన్నా పరిష్కరించుకోగలం. ఏమంటారు? మీ నలుగురూ బాగా ఆలోచించుకోండి. కూలంకషంగా ఆలోచించి పథకం ప్రకారం పోతుంటే చాలావరకు సమస్యల్ని పరిష్కరించుకోగలం. పండగకి మీకూ, అమ్మకీ, తమ్ముడికీ, చెల్లాయికి బట్టలు పంపుతున్నాము. పద్మ నమస్కారములు వ్రాయమంది. దీప్తి ముద్దులు. ఆఖరి మాట — "మీరు పోతే భారమంతా నాదన్నారు. ఒకవేళ నేనుపోతే? నా భార్యనీ, బిడ్డనీ ఆదుకుంటారా? ఊహు పుట్టింటికి పొమ్మంటారు. అందుకే యల్.ఐ.సి. కడుతున్నా. చూశారా? ఎంత చివరి వరకూ ఆలోచించానో? ఎందుకంటే కొందరికి జీవితం వడ్డించిన విస్తరి. నాలాటి మధ్య తరగతివాడికి 'బఫే' డిన్నర్. నా కంచంలోకి నేనే అన్నీ తెచ్చుకోవాలి. నేను ఈతరం వాడిని నాన్నా. ఈ వుత్తరం మీ నలుగురూ చదవండి. మీ మనస్సు తెలీక నొప్పిస్తే క్షమించండి.

ప్రేమతో మీ కుమారుడు
వెంకటేశ్వర్లు

## స్వగతం


ఆలోచన్ల తుంపరలో
తడిసి ముద్దవుతా
ఉండ చుట్టి విసిరిన కాగితమవుతా
గుర్తుతెలియని శవమవుతా
అంతు తెలియని తీరం వెంట
పరుగుతీసే అలనవుతా
నాలో నుంచి
నా కళ్ళ కొసల నుంచి
దిండు గలీబులో ఇంకిన
స్వప్నాలు తవ్వుతుంటానా..

చేదు నిజంలా రాత్రి
నిశ్శబ్దంగా నన్నల్లుకుంటుంది
రెప్పల మాటున రహస్యంగా
మళ్ళీ స్వప్నం కళ్ళు తెరుస్తుంది
ఎన్ని తూర్లు కన్నా అదే కల
మొండి గోడపై నినాదంలా
నా కళ్ళ చాటునే
నన్ను చేరని సమాలోచన
మళ్ళీ ఆలోచన్లు
తుంపరలై రాలుతాయి
ఒంటరిగా తడిసి ముద్దవుతా!

—పి.వి.రామశేషు

(రాజమండ్రి జెసీరెట్స్‌వారి పోటీలో రూ.100/- మూడవ బహుమతి గెలుపొందిన కవిత)

రాజమండ్రి జెసీరెట్స్ వారి పోటీలో రు. 100లు మూడవ బహుమతి పొందిన కార్టూన్




రాజమండ్రి జెసీరెట్స్ వారి పోటీలో రూ. 100లు మూడవ బహుమతి పొందిన ఫోటో





 బహుమతులు అందజేస్తున్నవారు: వందన కంచి శారీస్ - లేడీస్ అండ్ జెంట్స్ షోరూమ్ కోటగుమ్మం దగ్గర, రాజమండ్రి